క్లుప్తంగా

డా. పట్లోళ్ల నాగిరెడ్డికి సన్మానం



మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని సీనియర్ సిటిజన్ భవనంలో కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు పట్లోళ్ల నాగిరెడ్డి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయనను భరత్‌నగర్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్లోళ్ల నాగిరెడ్డి చేసిన సేవలను సీనియర్ సిటిజన్స్ గుర్తు చేసుకున్నారు. ఢిల్లీ స్థాయిలో మన భరత్ నగర్ పేరును తీసుకెళ్లిన ఘనత కూడా నాగిరెడ్డికే దక్కిందన్నారు.

విద్యార్థినికి చేయూత

సనత్‌నగర్: నిరుపేద విద్యార్థినికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, టీటీడీ ఎల్‌ఏసీ మెంబర్ వెల్లాల రామ్మోహన్ ఆర్థిక చేయూతనందించారు. ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌లోని శాంతినికేతన్ కళాశాలలో ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం (సీఈసీ) చదువుతున్న అస్రా సోఫికి అడ్మిషన్ ఫీజు మొత్తాన్ని ఆయన అందించారు. ఈ సందర్భంగా వెల్లాల రామ్మోహన్ మాట్లాడుతూ.. నిరుపేదలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. మహానేత వైఎస్సార్ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాల సాధనకు తనయుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. పేదింట ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాల్లో స్థిర పడ్డారంటే అది వైఎస్సార్ పుణ్యమే అన్నారు.

సమస్యల పరిష్కారానికి పరిశోధనలు అవసరం

ఉస్మానియా యూనివర్సిటీ: సామాజిక సమస్యల పరిష్కారానికి పరిశోధనలు అవసరమని ఐసీఎస్ఎస్ఆర్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రిచా శర్మ అన్నారు. గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రిచా శర్మ పరిశోధన ప్రతిపాదన రచన అనుబంధ సమాచారం అనే అంశం పై మాట్లాడారు. దేశంలో ఐసీఎస్ఎస్ఆర్ పనితీరు, లక్ష్యాలు, సాధించిన విజయాలను ఆమె వివరించారు. పరిశోధనల ప్రాజెక్టు లు, ఫెలోషిప్‌లు, ట్రావెల్ గ్రాంట్స్ తదితర అంశాల పై అవగాహన కల్పించారు. ఢిల్లీ, తమిళనాడు నుంచి ఎక్కువగా పరిశోధన ప్రతిపాదనలు వస్తున్నాయన్నా రు. సోషల్‌సైన్స్ డీన్ ప్రొ.స్టీవెన్సన్, చరిత్ర విభాగం హెడ్ ప్రొ.అంజయ్య, ప్రొ.లావణ్య పాల్గొన్నారు.

విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలి

సనత్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి అన్నారు. బేగంపేట డివిజన్ పరిధిలోని ఓల్డ్ పాటిగడ్డలోని బండిమెట్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం ఆమె చేతుల మీదుగా పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. మన బస్తీ–మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

నేటి నుంచి వార్డు కార్యాలయాలు ప్రారంభం

- వార్డు కార్యాలయాలకు వచ్చే పౌరులతో మర్యాదగా నడుచుకోవాలి
- ప్రతి ఫిర్యాదును త్వరగా పరిష్కరించాలని ఆదేశం
- అధికారులు, కార్పొరేటర్ల సమావేశంలో జెడ్‌సీ మమత

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో శుక్రవారం నుంచి డివిజన్‌లలో వార్డు కార్యాలయాలు ప్రారంభించనున్నట్లు కూకట్‌పల్లి జోనల్ కమీషనర్ వి. మమత తెలిపారు. గురువారం జోనల్ కార్యాలయంలో కార్పొరేటర్లు, వార్డుకు సంబంధించిన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డు కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి ఫిర్యాదులను స్వీకరించి సిటిజెన్ చార్ట్‌లో నిర్దేశించిన సమయం లోపల పరిష్కరించాలన్నారు. ఆయా వార్డు కార్యాలయాల అధికారులకు కార్పొరేటర్‌లతో పరిచయం కార్యక్రమం నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్‌లు మాట్లాడుతూ అధికార వికేంద్రీకరణలో భాగంగా పౌరుల వద్దకే పరిపాలన తీసుకెళ్తామన్నారు. పౌరుల సమస్యలను తక్షణమే పరిష్కరించి హైదరాబాద్ మహానగర పౌర సదుపాయాలు మెరుగుపరుస్తామని తెలిపారు. అందుకు అనుగుణంగా వివిధ శాఖలకు చెందిన వార్డు అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని కోరారు. వేరు వార్డు కార్యాలయ సమస్యలు వచ్చినట్లయితే ఆ వార్డుకు పంపించాలని జెడ్‌సీ మమత వార్డు అడ్మినిస్ట్రేటివ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్‌లు, ఎస్ఈ చిన్న రెడ్డి, డీసీలు రవికుమార్, రవీందర్‌కుమార్, ఈఈ గోవర్ధన్, డీడీ పద్మనాభం, సహాయ మున్సిపల్ కమిషనర్ కె. శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయ ప్రారంభోత్సవానికి అందరూ రావాలి..

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సమతానగర్‌లో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని శుక్రవారం ఉదయం 9.30 గంటలకు కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి డివిజన్ ప్రజలు, కాలనీ వాసులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వార్డు, ఏరియా మెంబర్లు హాజరు కావాలని కోరారు.

వార్డు కార్యాలయాలు ఏర్పాటుతో సుపరిపాలన

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రజలకు సుపరి పాలన అందించాలనే లక్ష్యంతో ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలసి ప్రారంభిస్తారు. ఇప్పటికే ఓల్డ్ బోయిన్‌పల్లి లాస్ట్ బస్టాప్ దగ్గర ఉన్న మున్సిపల్ కార్యాలయంలోని మొదటి అంతస్తులో అధికారుల కోసం క్యాబిన్లు ఏర్పాటు చేశారు. సిబ్బందిని కూడా నియమించడంతో వార్డు కార్యాలయం ప్రారంభించిన వెంటనే అయా విభాగాలకు చెందిన సిబ్బంది పనులు మొదలు పెడతారు. గురువారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత అధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్నీ డివిజన్లకు అధికారులను కేటాయించి కార్పొరేటర్లకు పరిచయ కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగానే ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ వార్డు పాలన అధికారులుగా సుదర్శన్‌కుమార్ సూపరిండెండెంట్ (రెవెన్యూ), అరవింద్‌కుమార్ (ఇంజినీరింగ్ ఏఈ), జశ్వంత్ (టౌన్‌ప్లానింగ్), స్వామి (ఎంటమాలాజీ), బుజ్జి (శానిటేషన్ జవాన్), సతీష్‌బాబు (యూబీడీ), సూపర్‌వైజర్, కృష్ణ (ఎలక్ట్రీషన్ జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్), విశాల్ (కంప్యూటర్ అపరేటర్), దుర్గ (యూసీడీ) లక్ష్మీనారాయణ యాదవ్, (వాటర్ వర్క్స్), సాంబశివరావు (టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఫోర్‌మెన్)ను నియమించారు. వీరిలో చాలా మంది సిబ్బంది కాంట్రాక్ట్ బెసిక్‌లో తీసుకోగా కొందరు ఇప్పటికే పని చేస్తున్నవారు ఉన్నారు.



కార్పొరేటర్‌లు, వార్డు అధికారులకు సూచనలు చేస్తున్న కూకట్‌పల్లి జెడ్‌సీ మమత

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్



దిల్‌కుష్‌నగర్‌కు సొంత నిధులతో రోడ్డు నిర్మించా

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్: నేనే మంత్రి అయితే అభివృద్ధి చేయటం అనేది ఒక అలవాటుగా మారుతుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం దిల్‌కుష్‌నగర్‌లో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి 1 కోటి 24 లక్షల రూపాయల నిధులతో నిర్మించే ఎస్‌డీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కాలనీవాసులు కరెంటు సమస్య చెప్పగా వెంటనే పరిష్కరించమని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాల కావాలని కోరారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. అదే విధంగా ఓ వృద్ధుడు పోచమ్మ గుడి కావాలి అని కోరారు. ప్రజలు అడిగిన అన్నింటికి ఎమ్మెల్యే మాధవరం దగ్గర నుంచి సానుకూలంగా రావటంతో కాలనీవాసులు మూడోసారి ముచ్చటగా మీరే గెలిచి మంత్రి కావాలని కోరారు. దిల్‌కుష్‌నగర్‌కు తన సొంత ఖర్చులతో రోడ్డు నిర్మించానని అన్నారు. వృద్ధాప్య, వితంతువు, వికలాంగ పెన్షన్‌లు ఇచ్చామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అరుణ, కవిత, ఆంజనేయులు, సుబ్బారావు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రారంభం

మోతీనగర్: విద్యార్థులకు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాల్సిన అవసరం మనందరిపై ఉందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లో ఏర్పాటు చేసిన జెన్ నెక్ట్స్ పాఠశాలను ఆయన స్థానిక కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, పాఠశాల కరస్పాడెంట్ బి. శ్రీలత, సిఈఓ జితేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ భారతి, డైరెక్టర్లు మల్లికార్జున్ చౌదరి, ప్రసాదరావు, నాయకులు రాజయ్య, సత్యం, శ్రీనివాసరెడ్డి, బీఎల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు నియోజకవర్గంలో ఎక్కడో ఒక చోట అభివృద్ధి కార్యక్రమం జరుగుతూనే ఉందన్నారు. నియోజకవర్గంలో మంచినీటి సమస్య రాకుండా ఎక్కడికక్కడ పెద్ద నీటి ట్యాంకులు నిర్మించామని తెలిపారు. గతంలో రోడ్లు వేయాలంటే నిధులు మంజూరుకు రోజులు తరబడి వేచి చూడాల్సి వచ్చేదని నేడు ఆ పరిస్థితి లేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ నాయకత్వంలో అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసి చకచక పనులు చేపట్టి పూర్తి చేస్తున్నామన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి మహిళలు ముందుకు రావాలి

- టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కేపీహెచ్‌బీ డివిజన్ మహిళా అధ్యక్షురాలు పొన్నం రజిత, మూసాపేట డివిజన్ మహిళా అధ్యక్షురాలు మాయకుంట్ల జోజోమ్మ వారు నియమించిన కమిటీ సభ్యులతో గురువారం టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని ఆయన సత్కరించి అభినందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో మహిళలు ముందుకు రావాలన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి మహిళా కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాళ్లకు నియామక పత్రాలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ బి బ్లాక్ అధ్యక్షురాలుగా శోభ, కేపీహెచ్‌బీ డివిజన్ మహిళా అధ్యక్షురాలుగా రజిత, మూసాపేట డివిజన్ మహిళా అధ్యక్షురాలుగా బోజమ్మకు గురువారం టీపీసీసీ సభ్యుడు గొట్టిముక్కల వెంగళరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమల, లక్ష్మి, లత, నిర్మల, విజయ, ఉదయరాజు, కేపీహెచ్‌బీ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ అప్పారావు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

అగ్రగామిగా శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతా



సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సాయిప్రశాంత్‌నగర్, ఆదిత్యనగర్, జైభారత్‌నగర్, హైదర్‌నగర్ కాలనీల్లో 1 కోటి 93 లక్షల 40 వేల రూపాయల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు పనులను చేపడుతున్నారు. గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ఈ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.

◆ అదే విధంగా హైదర్‌నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లోని సీసీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకోవటం చాలా సంతోషకరమైన విషయమన్నారు. అదే విధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. సీసీ రోడ్ల నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పనులు చేపట్టి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు, ఏరియా కమిటీ మెంబర్లు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిలో కూరుకుపోయిన కేసీఆర్ పాలన

- ప్రకాశ్ జవదేకర్

రాంగోపాల్‌పేట్: తెలంగాణలోని కేసీఆర్ ప్రభుత్వం అవినీతితో కూరుకుని పోయిందని మాజీ కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారు. గురువారం రాత్రి సికింద్రాబాద్‌లోని వెస్లీ జూనియర్ కళాశాలలో సనత్‌నగర్ నియోజకవర్గానికి చెందిన వ్యాపారులు, న్యాయవాదులు, వైద్యులు, వివిధ రంగాల్లోని ప్రముఖులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతితో పాటు కేసీఆర్ కుటుంబ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. మోదీ 9 ఏళ్ల పాలనలో అంతర్జాతీయ స్థాయిలో మనదేశ ప్రతిష్ట పెరగడంతోపాటు అన్ని దేశాలతో సత్సంబంధాలు నెరపడంతో ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. ఎలాంటి అవినీతి మచ్చ లేకుండా, పారదర్శకమైన పాలన కేంద్రం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మోదీ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వారికి వివరించారు. నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి, కార్పొరేటర్లు దీపిక, సుచిత్ర, సరళ, జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది రవీందర్, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

‘వ్యక్తిగత కక్షతోనే ఇబ్బంది పెడుతున్నారు’

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో అధ్యాపకునిగా ఉద్యోగ నియామకానికి రిటైర్మెంట్ తర్వాత నో డ్యూస్ సర్టిఫికెట్ జారీకి సంబంధం లేదని ప్రొ.అన్సారీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం వ్యక్తిగత కక్షతోనే అధికారులు నో డ్యూస్ సర్టిఫికెట్‌ను ఐదు నెలలుగా ఇవ్వకుండా తిప్పించారని, దీక్ష చేయడంతో ల్యాప్‌టాప్ డ్యూస్ ఉందని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుత వీసీ ప్రొ.రవీందర్ గతంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌గా కొనసాగినప్పుడు తన నిర్ణయాలను వ్యతిరేకించడంతోనే ఇప్పుడు తనను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రొ.అన్సారీ ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరోపణల్లో వాస్తవం లేదు..

ప్రొ.అన్సారీ, అధికారులు పాలక మండలి పై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పదవీ విరమణ తర్వాత రావాల్సిన బెనిఫిట్స్ పై ప్రొ.అన్సారీ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. నిబంధనల ప్రకారం బెనిఫిట్స్ ఇచ్చేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని కానీ.. ప్రచార, సామాజిక మాధ్యమాలలో ఓయూ అధికారులపై ప్రొ.అన్సారీ తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు.

వార్డు కార్యాలయాల్లో సమస్యల సత్వర పరిష్కారం

- నేటి నుంచి అందుబాటులోకి..
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారం కోసమే వార్డు కార్యాలయాల ను ఈ నెల 16న (నేడు) ప్రారంభించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. చిరు వ్యాపారుల కోసం అమీర్‌పేటలో 10, సనత్‌నగర్‌లో 18 దుకాణాలు నిర్మించగా వాటిని గురువారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. చిరు వ్యాపారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ దుకాణాలు నిర్మించడం జరిగిందన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు ఈ వార్డు కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారని ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదని, వార్డు కార్యాలయాల్లోనే ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలన్నారు. ఈ విధమైన వ్యవస్థ దేశంలో ఎక్కడా లేదని ప్రజలు ఈ వార్డు కార్యాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో వందల కోట్ల రూపాయల వ్యయంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టి దీర్ఘకాలిక సమస్యలను కూడా చాలా వరకు పరిష్కరించడం జరిగిందన్నారు. నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఎర్రగడ్డ–ఫతేనగర్–ఫ్లైఓవర్ వరకు ఉన్న రహదారి విస్తరణ చేసి డివైడర్ల నిర్మాణం చేయడంతో వాహనదారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ మోహన్‌రెడ్డి, ఈఈ ఇందిర, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, నాయకులు బాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్, రాజేష్‌ముదిరాజ్, సరాఫ్ సంతోష్, హన్మంతరావు పాల్గొన్నారు.



దివ్యాంగురాలితో కలిసి దుకాణం ప్రారంభిస్తున్న మంత్రి

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య



వనజ (ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ: భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ బాత్‌రూంలోని షవర్ రాడ్డుకు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన గురువారం ఉదయం కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నూజివీడు ప్రాంతానికి చెందిన పిల్లి శ్రీనివాసమూర్తి, వనజ (28) దంపతులు కేపీహెచ్‌బీ 6వ ఫేజ్‌లోని చందన అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి రెండు సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది కుటుంబ తగాదాలతో పాటు భర్త వేదింపులు భరించలేక వనజ బాత్‌రూమ్‌లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని పోలీసులుభావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మురుగు పారుతూ.. దుర్వాసన వెదజల్లుతూ..!

- పట్టించుకోని సంబంధిత అధికారులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ 209 బ్లాక్ వద్ద తరచూ డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. దీంతో ఈ ప్రాంతమంతా దుర్గంధంగా మారింది. దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో ఉన్నా పర్వత్‌నగర్ 209 బ్లాక్ వద్ద వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు నివసిస్తుంటారు. డ్రైనేజీ వాసనతో ఇళ్లలో నుంచి బయటకు రావాలన్నా.. వెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నిలవడంతో ఈగలు, దోమలు స్వైర్య విహారం చేస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులు రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీకి శాశ్వత పరిష్కారం చూపించాలని స్థానికులు కోరుతున్నారు.



పర్వత్‌నగర్ 209 బ్లాక్ వద్ద పారుతున్న మురుగు

కోర్టు ఆదేశంతో 20వేల మందికి న్యాయం

- గోల్డ్ స్టోన్ ప్రసాద్‌కు సుప్రీంలో చుక్కెదురు
- సర్వే నం.172 భూముల వివాదానికి పరిష్కారం
- 38 ఏళ్ల పోరాటంతో న్యాయం జరిగిందని వెల్లడి

భాగ్యనగర్‌కాలనీ: కూకట్‌పల్లి మండలం హైదర్‌నగర్‌లోని సర్వే నం.172లో త్రివేణి ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్‌సకు గోల్డ్ స్టోన్ ప్రసాద్‌కు మధ్య ఉన్న భూ వివాదంలో విచారణ అనంతరం సుప్రీంకోర్టు ఆ స్థలం ప్లాట్ ఓనర్స్‌కు చెందుతున్నట్లుగా తీర్పును వెలువరించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో త్రివేణి ప్లాట్ ఓనర్స్ కమిటీ సభ్యులు మాట్లాడారు. సర్వే నం.172లోని 196.20 ఎకరాల భూమిని సెట్వినాబాద్ కాలనీ, శ్రీ సత్యసాయి సొసైటీ, జయానగర్, శ్రీ సాయి గణేష్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కొనుగోలు చేసినప్పటి నుంచి భూమి వివాదంలో చిక్కుకుందని తెలిపారు.

◆ భూమి తమకు చెందిందని గోల్డ్‌స్టోన్ ప్రసాద్, అతని అనుబంధ సంస్థలు, వ్యక్తుల సమీనా కౌసర్, హమీదున్నీసా బేగం, ఫరీదుద్దీన్ ఖాన్‌లు వచ్చారన్నారు. అప్పటి నుంచి భూమి కొనుగోలు చేసిన వారంతో కలిసి త్రివేణి ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసి న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించామని తెలిపారు. ప్రభుత్వం సైతం భూమి ప్రభుత్వ భూమి అంటూ ఇంప్లీడ్ అయ్యేందుకు యత్నించిందన్నారు. 38 ఏళ్లుగా జరిగిన ఈ న్యాయ పోరాటంలో, దేశ సర్వోన్నత న్యాయస్థానం గురువారం తీర్పును తమకు అనుకూలంగా ఇవ్వటం ఆనందంగా ఉందన్నారు. ఈ కోర్టు ఆదేశాలతో 20వేల మందికి పైగా ఉన్న ప్లాట్ ఓనర్లకు న్యాయం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు మిఠాయిలు తినిపించుకొని ఆనందంతో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.



సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పును చూపిస్తున్న త్రివేణి ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు